# పాపం! పతితరాలు!!

కథానిక

**మహేశ్వర్**

★

అంతకుపూర్వమే ప్రేమాభిమానాలు చంపుకున్నది ఆమె. సందేహిస్తూనే అడిగింది తల్లిని:

'అమ్మా ఒక్కసారి పాపని తెప్పించవ్? అమ్మవారి పాదాలమీద వేస్తాను...' అని.

'ఛీ! అప్రాచ్యురాలా! జరిగింది చాలక యింకా నలుగురిచేతా వుమ్మించుకోటానికి చాలింది కాదు! ఉత్సవంలో కెళితే నలుగురూ నీ నీనిట్టుకుని గొరగొరా యీడ్చిపారేస్తారు. నీకు సిగ్గేమిటితే! తల్లిముండకొస్తాయ్ అగచాట్లు! వీధిలోకెళ్ళి మొహం యెత్తుకోలేకుండా చేసేస్ ఛండాలప్ముండా!' అని చరచరా నోటికొచ్చినట్టు రానిచ్చింది.

కన్నతల్లే యింత నిష్ఠురంగా మాట్లాడితే; సంఘానికి కొమ్ములు మొలిచేవున్నాయి—! కులభ్రష్ట! నీచురాలు! పతితురాలు! ఎవరైతే నేం— ఆమెని ప్రస్తుతం అంతవరకే తెలుసుకుందాం-- పెళ్ళి కాకుండా శిశువుని కన్నందుకు సమాజం ఆవిడమీద పెద్దచర్య తీసుకుంటుంది—కాకిరెట్టపెట్టి కడిగేస్తుంది—ఆమెనీ, వంశాన్నీ బహిష్కరించేరు— పుట్టిన పాపని ఆస్పత్రివాళ్ళకిచ్చేసేరు. మరి ఆ దుర్మార్గురాల్ని సముద్రంలో తోసేలేకపోయారా? ప్రభుత్వం, చట్టం, ఒప్పుకోదు—

*　　　*　　　*

గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభమై ఇరవై రోజులు కావస్తోంది. అనేక వేల జనం తిరగబడి వస్తున్నారు— చుట్టుపట్ల పల్లెలూ, గ్రామాలూ ఖాళీయై గ్రామదేవత ఉత్సవంలో లీనమైనాయ్. మేళాలూ, డప్పులూ, భజనలూ మారుమోగిపోతున్నాయ్. మొక్కుబళ్ళూ, పెట్టుబళ్ళూ మితిమీరిపోతున్నాయ్. అమ్మవారు తిరువీధి బయల్దేరింది బేండుమేళంతో-పన్నీటి స్నానంతో సప్తఘటాలూ సాగిపోతున్నాయ్.

అడుగడుక్కీ ప్రతితల్లీ తన ఎడబిడ్డనీ, ఒడిబిడ్డనీ అమ్మవారి పాదాలమీద వెయ్యటం, కాళ్లు కడిగి నీళ్లు జల్లుకోటం, ఘటంమీది పువ్వులూ సింధూరం తీసి పండా ఆ పిల్లలతల్లులకిస్తూ వంశపారంపర్యం దీవించటం చూస్తూంటే పతితురాలి పేగులు కదిలిపోతున్నాయ్.

''జయ్ మహామ్మాయికీ! జయ్ ఠక్కురాణీకీ-అన్న నినాదాలూ, భక్తులు మందారపూలూ, పేలాపు ఉండలూ విసరటం, ఒడ్డిమూక ఉల్లాలు పొయ్యటం, తెల్లగా వెలిగే రధాలూ, సాగిపోయే సప్తఘటాలూ పతితురాలి కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్టవుతోంది. కళ్లూ, చెవులూ ఉత్సవానికప్పగించినా ఆమె హృదయం ఆస్పత్రిలో పాపమీద వుంది-ఆ పసికూనని తెచ్చి అమ్మవారి పాదాలమీద పడేస్తే... కాళ్ళూ చేతులూ విలవిలా కొట్టి, ముసిముసి నవ్వుల్తో నూరేళ్లు ఆయుర్దాయం పోసుకోదూ? కన్నకడుపు భగ్గున మండింది. దేవత ప్రక్క దివిటీలు ఉజ్వలంగా ప్రజ్వలిస్తున్నాయ్.

*　　　*　　　*

రాత్రి పన్నెండు దాటిపోయింది. మేఘాచ్ఛేదితమైన అనంత వినీలాకాశంలో రెండు నక్షత్రాలు మిణుకు మిణుకుమంటున్నాయ్-పట్నం యావత్తూ ఉత్సవం జరుగుతూన్న వీధిలో ఉంది.

తక్కిన రోడ్లన్నీ నిర్మానుష్యం, పతితురాలు నడుచుకుపోతోంది-రోడ్డు పొడుగునా విద్యుద్దీపాలు

తోరణంలా వెలుగుతున్నాయ్—సివిగ్గార్డులందరికీ ఉత్సవంలో డ్యూటీ వెయ్యడంమూలాన కాబోలు ట్రంకురోడ్డు జంక్షన్‌లో బీటు పోలీసువాడు కునికిపాట్లు పడుతున్నాడు. పూరీ పాసింజెర్ కూతకూసి బయల్దేరిపోయింది. జట్కాల టకటక శబ్దాలు వినవస్తున్నాయ్-పతితురాలు ఆస్పత్రి గేటు సమీపించింది-పారావాడు నిద్రమత్తులో ఉన్నాడు. చంటిపిల్లల ఏడ్పులు సన్నగా వినబడుతున్నాయి-పతితురాలు చరచరా లోపలికి వెళ్లింది-లేబర్‌వార్డు మేక్‌లైటు కాంతులు వరండామీద పడుతున్నాయ్-వేసంకాలం, ఉక్కదంచేస్తూండడంమూలాన కొన్ని ఉయ్యాలలతో బెట్లు వరండామీదే ఉన్నాయ్.

ఇద్దరు నర్సులూ, ఒక పనిమనిషీ ఆ వరండామీదనే పడుకున్నారు-ఇద్దరుముగ్గురు బాలెంతల మూల్గులూ, ఆకలికి లేచిపోయిన పాపల ఏడ్పులూ ప్రశాంతాన్ని పాడుచేస్తున్నాయ్.

తన పాపని ఎక్కడవుంచేరో, ఏంచేసేరో ఆమెకి తెలీదు. ప్రతీ ఉయ్యాలకేసి జాలిగా చూస్తూ, ఎవర్ని లేపడానికీ, ఏంచెయ్యడానికీ పాలుపోక, కాలుగాలినపిల్లిలా తిరుగుతోంది-అమ్మవారు తిరువీధికెళ్ళి గుడికి మళ్ళిపోయినట్టు పాడగడుతూంది-పిల్లని వెతుక్కుని ఎత్తుకుపోతే? అమ్మో! రేపట్నుండీ ఎక్కడ పెంచడం? ఆస్పత్రివాళ్ళకి తెలిసి పోలీసులకప్పగిస్తే? ఛీ-తనుకన్న బిడ్డమీద తనకి అధికారం లేదు-'భర్త' అనే అధికారికి తప్ప ఇతరులకి పిల్లల్ని కనకూడదు-!! ఈ తలంపులతో నడుస్తూ ఆమె నర్సుపాదాలు ముట్టేసింది. ఆమె చప్పున లేచి స్విచ్చివేసింది. పతితురాలు వణకిపోతోంది-!

ఈ నర్సులూ, వార్డువాళ్లూ అంతా ఈమెకి పరిచితులే!

"ఎందుకమ్మాయ్, ఇంత రాత్రప్పుడు దొంగతనంగా వొచ్చేవ్?"

"ఒక్కసారి నా పాపని చూపించు మీనూ! దేలపుట్టి ఒచ్చేసేను-"

"చూసి వెళిపోతావా? వెళ్లకపోతే...?"

"ఒక్కసారి పాపని నాకివ్వాలి-మళ్ళా రేపీ పాటికి ఇచ్చేస్తాను"

"ఎందుకూ?"

"పాపని అమ్మవారి పాదాలమీద వెయ్యాలి! ఇంక రెండురోజుల్లో అనిపేస్తారు"

"పెద్దొరసానికి తెలుస్తే చంపేసూ? మా ఉద్యోగానికి నీళ్లు ఒదులుకోమన్నావా?"

"పరవాలేదు నర్సు-మళ్ళా రహస్యంగా తెచ్చి ఒప్పజెపతాను. నీకు ఉద్యోగభంగం రానీయను-"

"వీల్లేదమ్మాయ్. ఈ మిషన్ ఆస్పత్రి రూల్సు నీకు తెలీదు. ఆ బిడ్డమీద నీకెలాంటి హక్కూ లేదు-"

"నర్సు! నా బాధ్యత కనడంతో తీరిపోయింది-చూడూ మొక్కుతీర్చుకుని మళ్ళా నీకిచ్చేస్తాను-ఎరువిచ్చినట్టుగా ఇయ్యి!"

"అసంభవం-వేగం వెళ్ళిపో-ఎవరేనా చూసి పెద్దొరసానికి చెబితే నాబతుకు పాడైపోతుంది"

"నర్సు-నీ ఋణం ఉంచుకోను. నన్ను కనికరించవ్?" అంటూ చేతిఉంగరం తీసి ఆమెకివ్వబోయింది. నర్సు అది నిరాకరిస్తూ, "అమాయకురాలా నాచేతులో ఏంలేదు-రేపు ఉదయం దొరసానమ్మ ప్రతీ శిశువునీ విజిట్ చెయ్యడానికొస్తుంది-నీబిడ్డ కానరాకపోగానే నన్ను డిస్మిస్ చెయ్యదూ-వృధాప్రయాస దేనికి? రేపా శిశువు పెద్దదైనాక "బేప్పిజం"లో కలిపేస్తారు. మీ మతాలూ, ధర్మాలూ, మొక్కుబళ్ళూ దేనికి?"

"నిరాశా నర్సు? దొరసాన్నడుగుతే? అబ్బో మహాకోపం ఆవిడకి! పోతాన్లే..."

గుండె రాయిచేసుకొని పతితురాలు బేప్టిస్ట మిషన్ హాస్పిటల్ గేటు దాటి రోడ్డెక్కింది-రాత్రి 2 గంటలు దాటింది కాబోలు, విద్యుద్దీపాలు కొండ కెక్కేయ్...

రేపే అమ్మవార్ని అనిపేస్తారు. 'అంగడి' యావత్తూ కిటకిటలాడిపోతోంది. పూజలూ, పునస్కారాలూ యథావిధిగా సాగిపోతున్నాయ్- అందరి యిళ్ళల్లోనూ 'వుపారాలు' పెడుతున్నారు. పతితురాలు మాత్రం మరి వుత్సవానికి పోలేదు. ఇంట్లో 'వుపారం' పెట్టిందికి కులభ్రష్టురాలు- దేవతకి అపచారం—పాపపు కూడు యెలా ముట్టుకుంటుంది అమ్మవారు?

అనాదిరో వచ్చే ఆచారాలూ, సాంప్రదాయాలూ, పతితురాలు పాపపు సంతానానికి భగ్నమైనాయ్. కొంపకి చిచ్చుపెట్టేయ్.

'భగవతి మాతృస్వరూపిణి కాదూ? పతితులని వుద్ధరించలేని దేవతలెందుకు? మానవులూ దేవతలూ, ధర్మశాస్త్రాలకి బద్ధులైపోతే కాలచక్రం యెలానడుస్తోంది—దైవాన్ని శాసించేవి ఆచారాలూ, మూఢనమ్మకాలూ ఐతే; మరి దైవంలో వున్న సత్యమేమిటి? కాదు...కాదు......భగవతి నా పాపనుద్ధరిస్తుంది. శాసనాలు భగవదేచ్ఛను ఆటంకపరచలేవు...'

అని శీలహీన పరిపరివిధాల ఆలోచిస్తోంది— దబదబా తలుపుతట్టిన శబ్దం వినబడింది- మిషన్ ఆస్పత్రి బంట్రోతు ఓ వుత్తరం ఆమెకిచ్చి వెళ్ళిపోయేడు. పెద్దారసాని రాసింది- పాప ఒంటిమీద చిన్నచిన్న పొక్కులు లేచేయనీ, పాలుతాగక కింక పెడుతోందనీ, ఏ చికిత్సచేసినా లాభంలేదనీ, తల్లితప్పయింకెవ్వరూ ఆ బిడ్డని రక్షించలేరనీ రాస్తుంది.


మీకు కావలసిన

- ఖాదీ
- సిల్కు వస్త్రాలను



ఇంద్రా ఖాదీ ఎంపోరియమ్‌లో

కొనండి

శుద్ధ ఖద్దరు, సిల్కు తయారుచేయువారు :

*Purchase your Silk & Khadi requirments:* From: INDRA KHADI EMPORIAM,
**Pure Khadi & Silk Manufacturers,**
109 (Upstair) South Masi St., MADURA.

పతితురాలు యొగిరి గంతేసింది- భగవతిమహాత్మ్యం! తనబిడ్డని తను రక్షించుకోదూ? ఆమె మాతృత్వం,పరమ పవిత్రమైనది- ఏ పిల్లని ఆ తల్లి కాపాడుకునేది సృష్టిశాసనం—!

* * *

ఇసగవేస్తే రాలలేదు. అలా వున్నారు జనం. అమ్మయివారు తిరువీధి బయల్దేరింది నాటిసాయంత్రం—పోలీస్, రిజర్వ్, ఘాటు—కిటకిటలాడే జనసంధోహంలోంచి పతితురాలు పాపనెత్తుకుని బయల్దేరింది. ఒంటికి సన్నని గుడ్డ చుట్టింది—ఆమె బుజంమీద పసికూన చల్లగా నిద్రపోతోంది—

ఒకరి పోలీసు సాయంతో ఆమె లోపలికి ప్రవేసించింది—నీళ్ళతో ప్రధాన ఘటవాహకురాలి పాదాలు కడిగింది. మల్లెదండలు వేసింది. మెల్లిగా పాపనితీసి ఆమె పాదాలమీదవేసి 'భగవత్ ...' అని యేదో ఆవేదనతో తన దుఃఖమయ జీవిత భాండాన్ని పగలగొట్టాలనుకుంది- ఇంతలో పులివేషాల పోటీలో తాగుబోతుల కలియబడ్డారు. భీభత్సం, భయానకం...తోపులాట—పోలీసులాఠీలు హాతాయించేయ్---అమ్మవారు గడగడలాడిపోయింది—పెద్దఘటం బ్రద్దలై ఏకధారగా పాపని నీటితో తడిపింది. గులాబిపూలు కొల్లకొల్లలుగా విరజిమ్ముకుపోయినాయ్—మిగతా ఆరుఘటాలూ గజగజలాడిపోతున్నాయ్- పతితురాలు ఖిన్నురాలైంది భగవతి నాపాపని వుద్ధరించింది- అంటూ పువ్వుల్లోంచి పాపనెత్తుకుని వికారంగా 'నాపాపని భగతి పవిత్రం చేసింది-' అంటూ లేచింది.

అంత కోలాహలంలోనూ 'నా పాపని భగవతి వుద్ధరించింది...' అన్న ఒక్కకేకే వినబడుతూంది. గుంపులోండి పతితురాలు బయటకొచ్చింది.

పన్నీటి పూలతో తడిసినపాప ఆమె కౌగిట్లో నిశ్చింతగా నిద్రపోతోంది—


# MADRAS ENAMEL WORKS LTD.,

**65, SYDENHAM'S ROAD :: MADRAS.**

*Approved by the Government of India (I. S. D.)*

- SIGN BOARDS
- HOUSEHOLD UTENSILS
- HOSPITAL WARE
- ELECTRIC SHADES

Our Well Equipped Modern Factory

*Can meet all the Riquirements of*

- ADVERTISERS
- DISTRICT BOARDS
- RAILWAYS
- MUNICIPALITIES
- HOSPITALS
- ARMYS &

GENERAL PUBLIC

Telegram : **"ENAMELSIGN"**

★

Telephone : **2646.**